# 75. నూరు కోతులు

"సెలవు పెట్టే వెళ్తున్నావనుకో. అయినా హైదరాబాదులో మూడు రోజులుంటావుకనుక మన బిల్డింగ్ కాంట్రాక్టు శాంక్షనైందేమో కనుక్కో, అయిపోతే ఆర్డరు పట్టుకొచ్చీ" అన్నారు మా ఆఫీసరు గారు. "ఆర్డర్ తెస్తే మనకి లాభం ఉంటుంది" అని తన వేపు "వేలు" చూపించుకున్నారు. నాకు ఒక్కసారిగా రెండు విషయాలు అర్థమైపోయాయి. "మనకి లాభం" అంటే ఆయనికి లాభం అనీ; అది "వేలు" విలువ చేసేదనీ.

మా ఆఫీసుకి రెండో అంతస్తు కట్టే ప్రపోజలు శాంక్షన్ అయింది. ఆర్డరు తెచ్చేను.

"వి.హెచ్. అండ్ కో ఎండీ గారికి ఫోన్ చేసి వాళ్లలో ఎవరో ఒకరు ఇక్కడికొస్తే స్వీట్ ఆర్డర్ ఇస్తాం అని చెప్పు" అన్నారు ఆఫీసర్ గారు.

"వి.హెచ్. అండ్ కో మేనేజింగ్ డైరెక్టర్ వాయునందనరావు గారు ఊళ్లో లేరు. మేనేజింగ్ పార్ట్‌నర్ హనుమంతరావుగారు సైటుకి వెళ్లిపోయారు."

"మేనేజరు, ఎకౌంట్సు ఆఫీసరు, ఇంజనీర్ ఇంఛార్జి - ఎవర్నో ఒకర్ని పట్టుకో" అన్నారు మా ఆఫీసర్ గారు.

"మేనేజరు పవన్‌కుమార్ గారింకా ఆఫీసుకి రాలేదుటండి. ఎకౌంట్స్ ఆఫీసర్ రామదాసుగారు బేంకు కెళ్లేరటండి. ఇంజనీర్ - ఇన్ - ఛార్జి ఆంజనేయులు గారు దొరికారండి. రమ్మందామా?"

"వాయునందనరావు, హనుమంతరావు, పవన్‌కుమార్, రామదాసు, ఆంజనేయులూనా?" అని నవ్వేరు మా ఆఫీసర్‌గారు. "సరే ఎవడో ఒకడు; రమ్మను".

పది నిముషాల్లో ఆంజనేయులనే అతను వచ్చాడు. 28, 29 ఏళ్లుంటాయి. మొహమే కాదు, మనిషంతా ఎర్రగా ఉన్నాడు. ఎత్తుగా కూడా ఉన్నాడు.

"రావయ్యా, రా; కూర్చో. అదే, మా ఆఫీసు ఎక్స్‌టెన్షన్ కాంట్రాక్టు మీ కొచ్చింది. ఆర్డర్ స్వయంగా ఇద్దామనీ, పిలుస్త" అని చెప్పి; ఆ అబ్బాయి ఆర్డర్ తీసుకొని చదువుకుంటూ ఉండేలోగా "ఏ ఊరు మీది; ఎవరబ్బాయివి; ఇంటి పేరేమిటి, అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్లూ ఎందరు; అమ్మా నాన్నా ఉన్నారా, ఈ కంపెనీలో ఎన్నాళ్ల నుంచి పనిచేస్తున్నావు; జీతం ఎంతిస్తున్నారు; ఇస్తామని చెప్పిన జీతం అంతా ఇస్తున్నారా లేక కొన్ని కాన్వెంట్లలో లాగ ఎక్కువిచ్చినట్టు రసీదు పుచ్చుకుని తక్కువ ముట్టచెబుతున్నారా? జీతం ఫస్టు తారీకునే ఇస్తారా, లేక - రేపు రా, మాపు రా - అని తిప్పుతారా?" ఇలా కొశ్చన్లడిగేసి సమాచారం లాగేరు, మా ఆఫీసర్ గారు. ఆ అబ్బాయికి నెలకి మూడు వేలు జీతం వస్తోందనీ, బి.ఇ. పాసయేడని, ఇంకా పెళ్లి కాలేదని తెలిసింది. అతన్ని అక్కడే కూర్చోమని చెప్పి, స్వీటూ హాటూ కాఫీ తెప్పించి ఇచ్చేరు. "ఒక్కసారి ఇలారా!" అని నన్ను లోపలి గదిలోకి పిల్చుకెళ్లేరు మా ఆఫీసరు గారు. వెళ్లాలికదా, మరి!

"అవునూ, ఇతని పేరేమిటన్నావూ?" అన్నారు.

"అంజనేయులండి. ఇతనితో కలిపి ఆ ఆఫీసులో మొత్తం నూట నలుగురు." అన్నాను.

"అబ్బా, అంతమంది శ్టాఫ్ ఉన్నారా?

"అది కాదండి. బ్రహ్మచారీ శతమర్కటహా అన్నారు కదా. వాయునందనరావు, హనుమంత

రావు, పవన్‌కుమారు, రామదాసు ఈ నలుగురికీ పెళ్లిళ్లయిపోయాయండి."

"జోకులు చాల్లేగాని, ఇతను మా అమ్మాయికి ఈడూ జోడూ సరిపోయేటట్టున్నాడు; కనక అతనితో అలా కాస్త బైటికెళ్లి వ్యవహారం కదిపి చూడు."

నేను నాలిక కొరుక్కుని "సరే సార్. అలాగే సార్." అన్నాను.

"మా వాళ్లు నాకు పెళ్లి చెయ్యాలనే చూస్తున్నారు గానండీ; ఎప్పటికప్పుడు ఆడపిల్ల పేర్లు నప్పక సంబంధాలు తప్పిపోతున్నాయండి" అన్నాడు ఆంజనేయులు నాతో.

మొదటగా వొచ్చిన సంబంధంలో అమ్మాయి పేరు "వరూధిని"ట. "స్వారోచిష మనుచరిత్రలో కథానాయకి; ధర్మశాస్త్రం చెప్పిన మనువుకి తల్లి కదా; మంచి పేరేగా" అన్నాను.

"మా నాన్నగారొప్పుకోలేదండి. వరూధిని ప్రవరుణ్ణి చెడగొడదామని చూసిందిట. అది కుదరకపోతే గంధర్వుడు మారువేషంలో వస్తే లొంగిపోయిందిట. అంచేత పనికిరాదన్నారు."

"తరువాత?"

"శ్రీకాకుళం జిల్లా ప్రియాగ్రహారం కన్నేపల్లి వారి అమ్మాయండి. పద్దెనిమిదేళ్లకే సంస్కృతంలో భాషాప్రవీణ; సంగీతంలో డిప్లొమా, హిందీలో విశారదా, మెట్రిక్యూ అయ్యాయండి. కాని "ఈ అమ్మాయి పేరు ద్రౌపది; నాలుగు భాషలు నేర్చి, నాలుగు సర్టిఫికేట్లు తెచ్చుకున్నట్టే నలుగురు మొగాళ్ళని కూడా ఎరిగి ఉంటుంది. నువ్వు ఐదో వాడివవడం నాకిష్టం లేదు" అని మా అమ్మ అడ్డుపడిపోయిందండి."

"అయ్యో, అలాగా?"

"ఆ తరవాతొచ్చిన సంబంధంలో అమ్మాయి పేరు ఊర్వశిటండి. "ఈ ఊర్వశి దేవవేశ్య, పురూరవుణ్ణి పెళ్లిచేసుకుని కూడా అతని మనవడు వరస అయిన అర్జునుణ్ణి కామించింది. ఈ పేరు గల పిల్ల మనకొద్దు - అంటూ మళ్లీ మా నాన్నగారే పేచీపెట్టేరండి."

"మా ఆఫీసరు గారమ్మాయి పేరుతో మీ వాళ్లకి అలాటి పేచీలేమీ ఉండవు. పైగా దగ్గిర దగ్గిర యాభైవేలు కట్నం ఇవ్వడమే కాకుండా మీ వాళ్ల సరదాలు కూడా యధాశక్తిగా తీరుస్తారు. మీకిప్పుడు ఖాళీ ఉంటే పదండి, అమ్మాయిని మీకు చూపిస్తాను." అన్నాను.

"ఇప్పుడే, ఇలాగే?" అన్నాడు ఆ అబ్బాయి, సరదా దాచుకోకుండా; నా స్కూటర్ నాకే చూపిస్తూ.

"ఆహా, ఇప్పుడే! మనోజయంతు మాండవ్యం అని శాస్త్రం" అని ఎంకరేజ్‌మెంటిచ్చాను.

"ఇంతకీ ఆ అమ్మాయి పేరేమిటండీ?"

"బంగారం లాంటి పేరు! సీతామహాలక్ష్మి" అన్నాను, గర్వంగా.

"శ్రీరామ, శ్రీరామ!" అని చెవులు మూసుకున్నాడు ఆ అబ్బాయి. "అన్నీ తెలిసిన వారు తమరే ఇలాటి సూచన చేస్తున్నారేంటి సార్? నాపేరు ఆంజనేయులు, ఆమె పేరు సీతామహాలక్ష్మి! మా ఇద్దరికీ పెళ్లా? ఇంతకంటే దైవదూషణ మరొకటుంటుందా?"

దాంతో, అతని పెళ్లికి అడ్డు పడుతున్నదెవరో నాకు తెలిసిపోయింది. ★